క్లుప్తంగా

పెట్టుబడులు తగ్గించాలి

దొర్నిపాడు: పంటలకు భూసార పరీక్షల ఆధారంగా పెట్టుబడులు వెచ్చించుకోవాలని ఇష్టానుసారంగా రసాయన ఎరువుల వాడకం వల్ల నేల స్వభావం దెబ్బతింటుందని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో మట్టి నమూనాల సేకరణపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఏ రంగారెడ్డి, సర్పంచ్ శివరామిరెడ్డి, ఉప సర్పంచి మహేష్, ఆలయ ధర్మకర్త పల్లె శంకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కాళికాంబకు ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీ చౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం అనంతరం పట్టువస్త్రాలతో అలంకరించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో జుమ్మాతుల్ విధ



ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నంద్యాల(వ్యవసాయం): రంజాన్ మాసంలో వచ్చే చివరి శుక్రవారాన్ని జుమ్మాతుల్ విధ అంటారు. పట్టణంలోని జామియా మసీదు, జుమ్మామసీదు, అంటికోట మసీదు, ఆల్‌పుర్ఖాన ఈద్గా, మజీద్‌ఏ రసూల్, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంజుమన్ మసీదులో ముస్లింలు చివరి శుక్రవారాన్ని పురస్కరించుకొని పెద్ద ఎత్తున సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి అజ అనంతరం 12.45 గంటల వరకు కుద్బా కార్యక్రమం జరిగింది. రాత్రంతా మసీదుల్లో ప్రత్యేక నమాజ్, ఖురాన్ పఠనం చేస్తూ అల్లాను ప్రసన్నం చేసుకున్నారు. అల్లా దైవారాధన చేయడం వల్ల 83 ఏళ్ల కాల పుణ్యం లభిస్తుందని ముస్లింలు విశ్వసిస్తారు.

స్పందన అర్జీలు పరిష్కరించాలి

నంద్యాల(రూరల్): గ్రామ సచివాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి వచ్చే ప్రతి అర్జీని ఇచ్చిన గడువులోపు పూర్తి చేయాలని నంద్యాల డివిజన్ లెవల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీఓ) జనార్ధన్‌రావు సచివాలయ ఉద్యోగులకు తెలియజేశారు. శుక్రవారం మండలంలోని చాపిరేవుల, పాండురంగాపురం గ్రామాల సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయా సచివాలయాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకునులా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీఓ భాస్కర్, పీఎస్ అంకన్న ఉన్నారు.

పరిశ్రమల ఏర్పాటులో మహిళలకు సాయం




మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్

నంద్యాల(అర్బన్): ఈ ఆర్థిక సంవత్సరంలో ఎస్‌బీఐ నుంచి స్వయం సహాయక సంఘాల్లోని ప్రతి మండలంలో ఐదుగురు మహిళలు వ్యక్తిగతంగా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు చేపడుతున్నామని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు రాష్ట్రస్థాయిలో ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం 29 మండలాల ఏపీఎం, ఏసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ 2023–24లో మహిళలకు సుస్థిరమైన జీవనోపాధుల ఏర్పాటుకు అవసరమైన ప్రణాళికలు తయారు చేశామన్నారు. పరిశ్రమల ఏర్పాటులో బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, సంస్థాగత నిర్మాణం తదితరాలపై సమీక్షించారు. ప్రాజెక్టు డీపీఎం దానం, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సత్యనారాయణ, ఫిషరీస్ ఏడీ సంధ్యారాణి, చంద్రశేఖర్‌రావు, ఎల్లయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆళ్లగడ్డ: చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆళ్లగడ్డ రూరల్ ఎస్‌ఐ నరసింహులు తెలిపారు. శుక్రవారం ఆయన ప్రచార వాహనం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఇంట్లో బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు బ్యాంక్ లాకర్‌లో పెట్టుకోవాలని సూచించారు. పోలీసులకు సమాచారం ఇస్తే గస్తీ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

రంజాన్ కానుక పంపిణీ



ముస్లింలకు సరుకులు అందజేస్తున్న గంగల ఇందిరమ్మ

ఆళ్లగడ్డ: పండగ పూట పేద ముస్లింలు సంతోషంగా పండుగ జరుపుకోవాలని కానుకలు పంపిణీ చేస్తున్నామని గంగల ఇందిరమ్మ తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇంజేటి నాగిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సద్దాం కాలనీలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంజేటి సరిచందనరెడ్డి, గోపవరం నరసింహారెడ్డి, చంద్రమౌళీశ్వరరెడ్డి, ఆజాద్ ఉన్నారు.

మెరిసిన మిరప

- అనుకూలించిన వాతావరణం
- ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి
- ధర క్వింటా రూ.24 వేలకు పైనే..
- నంద్యాల నియోజకవర్గంలో 5,217 ఎకరాల్లో పంట సాగు





గోస్పాడు సమీపంలో మిరపను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు, తేళ్లపురి సమీపంలో కుప్పగా పోసిన మిరప

గోస్పాడు: మిరప రైతులకు ఈ ఏడాది కలిసొచ్చింది. మునుపెన్నడూ లేనంత ధర దిగుబడికి లభిస్తుండటం, దిగుబడి కూడా అంచనాకు మించి వస్తుండటంతో సంతోషంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. సాధారణంగా మిరప సాగు ఖర్చుతో కూడుకున్నది. ఏమాత్రం తేడా వచ్చినా రైతులు భారీగా నష్టపోతారు. దీంతో అధిక శాతం రైతులు సాగుకు మొగ్గుచూపరు. అయితే ఇటీవల ఈ పంట సాగుకు అన్నదాతలు చొరవ చూపుతున్నారు. ఈ ఏడాది సీజన్ ప్రారంభం నుంచి వర్షాలు సకాలంలో కురవడం పంటకు వరంగా మారింది. అలాగే వాతావరణం అనుకూలంగా మారడంతో తెగుళ్లు తక్కువగా సోకడంతో దిగుబడులు పెరిగాయి. గోస్పాడు మండలంలోని రాయపాడు, తేళ్లపురి, ఎస్.కూలూరు, పసురపాడు, జూలేపల్లె, చింతకుంట్ల, యాళ్లూరు, బీవీ నగర్, ఒంటివెలగల, శ్రీనివాసపురం, తదితర గ్రామాల్లో రైతులు అధికంగా మిర్చి పైరును సాగు చేశారు. ఈ ఏడాది సాధారణ విస్తీర్ణం 973 ఎకరాలు కాగా రైతులు మిరప పైరును 1,827 ఎకరాల్లో సాగు చేశారు. నంద్యాల మండలం సాధారణ విస్తీర్ణం 2,700 ఎకరాలు కాగా 3,390 ఎకరాల్లో పంట సాగు చేశారు. మిట్నాల, గుంతనాల, పుసులూరు, పోలూరు, ముదుమాల్పురం, చాపిరేవుల, బ్రాహ్మణపల్లె, మునగాల, రాయమాల్పురం, భీమవరం గ్రామాల్లోమిరప పంటను అధికంగా సాగు చేశారు.

రూ.20వేల పైగానే ధర..

ప్రస్తుతం మార్కెట్లో ధర కూడా రైతులకు గిట్టుబాటు అయ్యేలా పలుకుతుంది. మిరప రకాన్ని, నాణ్యతను బట్టి క్వింటా ధర రూ.24 వేలకు పైగానే పలుకుతోంది. పైరు సాగు కోసం ఎకరాకు రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షల దాకా వెచ్చించారు. దిగుబడులు ఎకరాకు 15 నుంచి 25క్వింటాళ్ల వరకు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. పంట సాగు చేశాక కొంత మేర తెగుళ్ల ఇబ్బందులు పెట్టినా నివారించుకోవడంతో దిగుబడులు ఊపందుకున్నాయి. ప్రస్తుతం మండలంలోని బయలు ప్రాంతాలు, ఖాళీ పొలాల్లో మిరప దిగుబడి ఆరబోసుకున్న దృశ్యాలు అధికంగా కనిపిస్తున్నాయి. కల్లాల్లో ఆరబోసుకొని, కూలీలతో గ్రేడింగ్ చేయిస్తున్నారు.

నంద్యాలలో కొనుగోలు యార్డు ఏర్పాటు..

గతంలో మిర్చి దిగుబడిని విక్రయించేందుకు నానా అవస్థలు పడాల్సివచ్చేది. గుంటూరుకు తరలించడానికి వాహనాల ఖర్చు, దారి ఖర్చులు తడిసి మోపెడయ్యేది. అలాగే అక్కడ మన వరకు వచ్చే వరకు వేచి చూడాల్సిన పరిస్థితి. ఒక వేళ మార్కెట్‌లో కొనుగోళ్లు నిలిచిపోతే ఆ రోజుల్లో అక్కడే ఉండాల్సి వచ్చేది. ఇలా ఎన్నో కష్టాలను ఓర్చి పంటను విక్రయించినా ధర అంతంతగానే లభించేది. సమస్య తీవ్రతను గుర్తించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నంద్యాలలోనే మిర్చి కొనుగోలు యార్డు ఏర్పాటుచేశారు. దీంతో రైతులకు అవస్థలు తప్పడంతో ఆర్థికంగా ఎంతో మిగులుబాటు చేకూరింది. ఇక్కడే విక్రయించాల్సి వస్తుండటంతో నామమాత్రపు రవాణా ఖర్చు అవుతుండటం, దిగుబడిని అమ్ముకొని సాయంత్రానికి ఇంటికి వెళ్లిపోతుంటంతో ఇబ్బందులు తప్పాయి. కొనుగోలు యార్డు ఏర్పాటుతో తమకు ప్రయోజనం చేకూరిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడి, ధర బాగుండటంతో కష్టాన్ని మరిచిపోయాం



పైరు సాగుకు ఎకరాకు దాదాపు రూ.2 లక్షలకు పైగా ఖర్చు చేశాం. ఈ ఏడాది వాతావరణం అనుకూలించినా పంట సాగు చేసిన తొలినాళ్లలో తెగుళ్లు కొంతమేర ఇబ్బంది పెట్టాయి. అయినా కష్టడ్డాం మంచి దిగుబడి, ధర లభించడంతో ఆ కష్టాన్ని మరిచిపోయాం.గతంలో మిర్చి దిగుబడిని అమ్ముకునేందుకు గుంటూరుకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా నంద్యాలలోనే కొనుగోలు యార్డు ఏర్పాటు చేయడం తమకెంతగానో మేలు చేకూర్చింది.

– చంద్రహాసేని, రాయపాడు, గోస్పాడు

సస్యరక్షణ పద్ధతులతో మంచి దిగుబడులు



మిరప పంట సాగులో రైతులు సరైన సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో దిగుబడులు పెరిగాయి. ప్రస్తుతం మార్కెట్లో ధర కూడా బాగానే ఉంది. మిరప పైరు విక్రయించుకునేందుకు నంద్యాలలోనే కొనుగోలు యార్డు ఏర్పాటైంది. అన్నదాతలు ఇక్కడే ఉత్పత్తులను విక్రయించుకోవచ్చు.

–అబ్దుల్‌హక్, ఏఓ, గోస్పాడు

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(రూరల్):పేదల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రాయమాల్పురం గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలో నూతనంగా రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలను వివరిస్తూ, సమస్యలు తెలుసుకొని అక్కడే ఉన్న అధికారులకు పరిష్కరించాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో లంచాలు ఇచ్చినప్పటికీ అర్హులైన చాలా మందికి సంక్షేమ పథకాలు అందేవి కాదన్నారు. జగనన్న ప్రభుత్వంలో లంచాలకు తావులేకుండా నేరుగా అర్హులైన ప్రజల ఇంటివద్దకే పథకాలు అందిస్తున్నమని చెప్పారు. ఎంపీపీ శెట్టి ప్రభాకర్, ఎంపీడీఓ భాస్కర్, నంద్యాల మార్కెట్‌యార్డు చైర్మెన్ మహేశ్వరరెడ్డి, సర్పంచ్ పార్వతమ్మ, మునగాల గ్రామ సర్పంచ్ లోకేశ్వరరెడ్డి, నాయకులు పూల శీను, బాషా, రామచంద్రారెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, పులిమద్ది సామన్న పాల్గొన్నారు.

హైవే సర్వే పనులు ఆపాలి



ఫోన్‌లో జేసీతో మాట్లాడుతున్న ఎంపీ పోచా

నంద్యాల(రూరల్): నంద్యాల మండలం కానాల గ్రామంలో చేపట్టిన 167–కే కల్వకుర్తి–జమ్మలమడుగు జాతీయ రహదారి నిర్మాణ సర్వే పనులు నిలిపివేయాలని సీపీఎం రైతు సంఘం నాయకులు స్థానిక రైతులతో కలిసి గ్రామంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఇదే సమయంలో అటుగా కోవెలకుంట్లకు వెళ్లుతున్న నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందారెడ్డి కాన్వాయ్‌ను అడ్డుకోవడంతో ఎంపీ పోచా వారి సమస్యలను విన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సర్వే పనులు రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో జరగడం లేదని, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతోందని తెలిపారు. దీంతో రైతులు మాట్లాడుతూ కొందరు రాజకీయ నాయకుల ఉద్దేశపూర్వకంగానే రహదారి అలైన్‌మెంట్ మార్చారని ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎంపీ..నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతితో ఫోన్‌లో మాట్లాడుతూ కానాల గ్రామం సమీపంలో జరుగుతున్న జాతీయ రహదారి సర్వే పనులు ఆపాలని, గ్రామ సభ నిర్వహించి సర్వే చేపట్టాలని కోరారు. తనంతరం సర్వే పనులను నిలిపివేస్తున్నమని ఎంపీ చెప్పడంతో వారు ధర్నా విరమించారు.

• అందుబాటులో చేతి పంపుల సామగ్రి

రుద్రవరం: 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.6.60 లక్షలు వెచ్చించి చేతి పంపుల విడి భాగాలు కొనుగోలు చేశామని ఏఓ వరలక్ష్మి తెలిపారు.ఎండలు తీవ్రం అవుతుండటంతో భూగర్భ జలాలు అడుగంటి తాగునీటి సమస్య తలెత్తితే.. ముందస్తు చర్యల్లో భాగంగా చేతి పంపుల విడి భాగాలను కొనుగోలు చేసినట్లు చెప్పారు. చేతి పంపులు పనిచేయక పోతే మరమ్మతులు చేయించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

• రంజాన్ తోఫా పంపిణీ

నంద్యాల(అర్బన్): డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మస్తాన్‌వలి ఆధ్వర్యంలో పట్టణంలోని జగజ్జననీనగర్‌కు చెందిన నిరుపేద ముస్లిం దివ్యాంగ కుటుంబాలకు రంజాన్ తోఫా, చీరలు పంపిణీ చేశారు. స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ కృష్ణయ్య 50మంది దివ్యాంగులకు తోఫా, చీరలు అందజేశారు. మహిళా అధ్యక్షురాలు లక్ష్మీకాంతం, సభ్యులు కిరణ్‌కుమార్, నబిరసూల్, సయ్యద్ మౌలాలి పాల్గొన్నారు.

• కూలీలను వడదెబ్బకు గురికానివ్వొద్దు

శిరివెళ్ల: వేసవిలో ఉపాధి కూలీలు వడదెబ్బకు గురికానివ్వద్దని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం పనులపై ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం 7 గంటల కల్లా కూలీలు పనులు మొదలు పెట్టాలన్నారు. అలాగే 11 గంటలలోపు ఇంటికి వెళ్లేలా చూడాలని చెప్పారు. పనుల వద్ద గుడారాలు, తాగునీరు సదుపాయం కల్పించాలని ఆదేశించారు.

• క్యాన్సర్ అంటువ్యాధి కాదు

నంద్యాల(వ్యవసాయం): క్యాన్సర్ అంటువ్యాధి అని చాలా మందికి అపోహ ఉందని, అది నిజం కాదని ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు డాక్టర్ సాయిప్రణీత్ తెలిపారు. శుక్రవారం స్థానిక రామకృష్ణ పీజీ కళాశాలలో విద్యార్థులకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నయం చేసుకోవచ్చన్నారు. డాక్టర్ గీతావాణి మాట్లాడుతూ రొమ్ముక్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, నోటి క్యాన్సర్, ఊపిరితిత్తులు తదితర వాటిపై అవగాహన కల్పించారు.


• విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించాలి

నంద్యాల(సిటీ): వేసవి సెలవులలో విద్యార్థుల సమయం వృథా కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టి వారిలో పఠనాశక్తి పెంపొందించుకునేలా చర్యలు చేపట్టాలని డీఈఓ అనురాధ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ ఆదేశాల మేరకు మే 1నుంచి జూన్ 10వ తేదీ వరకు వియ్ లవ్ రీడింగ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లాలోని అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు కార్యక్రమాన్ని అమలు చేయడానికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

డ్రై డే..ఫ్రైడేపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

నంద్యాల(రూరల్): ప్రతి శుక్రవారం డ్రైడే..ఫ్రైడే కార్యక్రమం అమలులో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని నంద్యాల డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని అయ్యలూరు పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించి, డ్రైడే..ఫ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఆశా కార్యకర్తలు, సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తాం



సిబ్బంది వినతులను స్వీకరిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: పోలీసు శాఖలో పనిచేసే సిబ్బంది సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి పేర్కొన్నారు. బొమ్మలసత్రం వద్దనున్న ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్‌డే నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న 12 మంది సిబ్బందికి మ్యూచ్‌వల్ ట్రాన్స్‌ఫర్లు, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీలపై వినతులు అందాయని వాటికి పరిష్కారం చూపుతామని చెప్పారు. ఎస్‌బీ సీఐ దస్తగిరిబాబు పాల్గొన్నారు.

ఈద్గాల వద్ద పటిష్ట భద్రత..

రంజాన్ పర్వదినం సందర్భంగా జిల్లాలోని అన్ని ఈద్గాల వద్ద శనివారం పోలీసులతో భద్రత ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. ప్రధాన పట్టణాల్లో రంజాన్ పండుగ సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. ప్రార్థనా స్థలాల వద్ద అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టామని చెప్పారు. ప్రజలు పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు.

టీడీపీ నేతలకు అభివృద్ధి కనిపించదు



ఉయ్యాలవాడలో కూరగాయల మార్కెట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ పోచా

ఉయ్యాలవాడ : నంద్యాల జిల్లాలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. విద్య,వైద్యం, తాగునీటి సౌకర్యం, రహదారులు, రైతులకు గిట్టుబాటు ధర, మిరప కొనుగోలు యార్డు.. ఇలా పలు రకాల అభివృద్ధి పనులు తమ ప్రభుత్వంలో జరిగాయి. ఇంత జరుగుతున్నా.. అవేవీ టీడీపీ నేతలకు కనిపించడం లేదని నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రూ.75 లక్షలతో నిర్మించిన రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులు, రూ.30 లక్షలతో నిర్మించిన కూరగాయల మార్కెట్, రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.13 లక్షలతో నిర్మించిన మురుగు కాలువలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నాలుగేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు కసాని పుణ్యలక్ష్మిదేవి, సర్పంచ్ మేకల ఓబులేస్, ఎంపీటీసీ గగ్గెర వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, రైతు సలహా మండలి చైర్మన్ పోచా రాధాకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి, పోచా వెంకటరెడ్డి, లాలమ్మగారి హుసేనయ్య, మండల స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ ముసాని శివానందరెడ్డి, నాయకులు కందుల చిన్న వెంకటసుబ్బారెడ్డి, కపురం శ్రీనివాసరెడ్డి, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ డీఈ సునీల్‌రెడ్డి, లక్ష్మీనరసింహుడు, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, విశ్రాంత ఏఈ కరీంబాషా తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తారు విందు: శుక్రవారం ఉయ్యాలవాడలో ఎంపీ స్వగృహంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.వివిధ గ్రామాల నుంచి ముస్లింలు పాల్గొనగా.. ఎంపీ పోచా వారితో కలిసి ప్రార్థనలు చేసి ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, మండల రైతు సలహా కమిటీ చైర్మన్ పోచా రాధాకృష్ణారెడ్డిని ముస్లింలు గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ మెంబర్ కోడూరు అమీర్ అహమ్మద్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.



ఎంపీని సన్మానిస్తున్న ముస్లింలు

పీఓఎల్ఆర్ సర్వే త్వరగా పూర్తి చేయండి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ కింద పెండింగ్‌లో ఉన్న సర్వేను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తహసీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పీఓఎల్ ఆర్ రీ సర్వే, భూసేకరణ, ఇళ్ల పట్టాలు, కోర్టు కేసుల సత్వర పరిష్కారం తదితర రెవెన్యూ అంశాలపై జాయింట్ కలెక్టర్ నిశాంతితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బండి ఆత్మకూరు, చాగలమర్రి, ప్యాపిలి మండలాల్లో పెండింగ్‌లో ఉన్న రీ సర్వేను వేగంగా పూర్తి చేయాలన్నారు. గడువులోపు నాణ్యతతో పూర్తి చేయాలని మండల సర్వేయర్లను, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ శ్రీరాంకు సూచించారు. జూపాడుబంగ్లా, పాములపాడు, కొత్తపల్లి, బనగానపల్లె తదితర మండలాల్లో గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీల కోసం శ్మశాన వాటికలను గుర్తించి వారం రోజుల్లో నివేదికలు ఇవ్వాలని చెప్పారు. అసైన్మెంట్ ల్యాండ్ డీ మార్కింగ్‌కు సంబంధించి శిరివెళ్లలో 6.7ఎకరాలు, బేతంచెర్లలో 30 ఎకరాలు, ప్యాపిలిలో 70 ఎకరాలు, పాములపాడులో 30 ఎకరాలు పెండింగ్‌లో ఉందని, ఇందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి సమర్పించాలన్నారు. మిడుతూరు, శ్రీశైలం, బండిఆత్మకూరు, బేతంచెర్ల, బనగానపల్లె తదితర 11 మండలాలకు హౌసింగ్ డేటా అందజేయాలని కోరారు. జేసీ నిశాంతి మాట్లాడుతూ చెంచుగూడేల్లో పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డులను పంపిణీ చేయాలన్నారు. రైతుల ఆత్మహత్యలకు సంబంధించిన వివరాలు పంపాలని తెలిపారు. ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ కామేశ్వరరావు, నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్‌డీఓలు శ్రీనివాసులు, వెంకట్‌రెడ్డి, ఎం.దాసు పాల్గొన్నారు.

• బనగానపల్లె సీఐగా మల్లికార్జున గుప్తా

బొమ్మలసత్రం: బనగానపల్లె సీఐగా మల్లికార్జున గుప్తాను నియమిస్తూ శుక్రవారం రాత్రి జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న సీఐ మల్లికార్జున గుప్తాతో పాటు ఎస్‌ఐలుగా నవీన్‌బాబు, వీరాంజనేయులును నియమించారు. అలాగే వీఆర్‌లో ఉన్న మరో ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డిని నంద్యాల తాలుకా పోలీస్‌స్టేషన్‌కు నియమిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి.


• అహోబిలం దేవస్థాన ఉద్యోగిపై కేసు నమోదు

ఆళ్లగడ్డ: అహోబిలం దేవస్థాన ఉద్యోగి రాంభూపాల్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ నరసింహులు తెలిపారు. ఎగువ అహోబిలంలో విధులు నిర్వర్తిస్తున్న సుబ్బయ్యపై దాడి చేశాడనే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

సమస్య చెబితే.. అధికారి వెటకారం

నంద్యాల(సిటీ): పట్టణంలో 42 వార్డుల్లో సుమారు 2.50 లక్షల మంది నివసిస్తున్నారు. అయితే నిత్యం ప్రజలు నీటి సమస్యలు, టౌన్‌ప్లానింగ్, పారిశుద్ధ్యంపై మున్సిపల్ అధికారులకు విన్నవించుకోవడం పరిపాటి. ఇది ఇలా ఉంటే నంద్యాల మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న రవిచంద్రారెడ్డి మాత్రం సామాన్య ప్రజలతో పాటు, సహోద్యోగులతో పాటు సిబ్బందితో ఎప్పుడూ రుసరుసలాడుతున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. శుక్రవారం పట్టణంలోని గెలివి పాఠశాల ఎదురుగానున్న సమాధుల సందులో నివాసం ఉంటున్న మహబూబ్‌బాషా..రెండు రోజులగా తమ ప్రాంతంలో నీటి సమస్య ఉందని ఫిట్టర్ రఫీకి ఫోన్ చేశారు. రఫీ స్పందించకపోవడంతో నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేశారు. ఇందుకు కమిషనర్ వెటకారంగా ఇచ్చిన సమాధానం, వారి మధ్య జరిగిన సంభాషణ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుంది. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రెండు రోజులుగా నీరు రావడం లేదని విన్నవించుకుంటే.. వెటకారంగా మాట్లాడి బెదిరించే ప్రయత్నం చేశారని మహబూబ్ బాషా వాపోయాడు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్‌ను సాక్షి వివరణ కోరగా.. వాయిస్ తనదేనని, ఆ సమయంలో మరో ఫోన్‌లో మాట్లాడుతుండటంతో క్రాస్ టాక్ జరిగి ఉండొచ్చని చెప్పారు.

పంట పొలాల్లో పెద్ద పులి సంచారం



పాద ముద్రను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

రుద్రవరం: మండల పరిధిలోని కోటకొండ గ్రామ పంట పొలాల్లో పెద్ద పులి సంచరించినట్లు పాదముద్రలు కనిపించడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన పెరుమాళ్ల చెన్నయ్య అనే రైతు తెలుగుగంగ ప్రధాన కాల్వ సమీపంలో తన పొలంలో పూల తోట సాగు చేశాడు. రెండు రోజులుగా తోటకు బోరు బావి నుంచి నీరు పారిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయాన్నే పొలానికి వెళ్లగా బోరు మోటర్ వద్ద బురదలో పెద్దపులి పాదముద్రలు గుర్తించి అటవీ అధికారులకు సమాచారం అందించాడు. ఈ మేరకు పెద్దకంబలూరు సెక్షన్ అధికారి శ్రీనివాసులు, కోటకొండ బీట్ అధికారి రామేశ్వరి అక్కడికి చేరుకొని పాదముద్రలను పరిశీలించి ఆ ప్రాంతంలో పెద్దపులి సంచరించినట్లు నిర్ధారించారు. అయితే పెద్ద పులితో పాటు కొండ గొర్రె పాదముద్రలు ఉన్నట్లు గమనించారు. అక్కడి నుంచి పెద్దపులి తెలుగుగంగ అవతలి వైపున్న అడవిలోకి వెళ్లినట్లు గుర్తించారు. అనంతరం వారు అక్కడక్కడా బాణాసంచా పేల్చారు. పొలాల్లో ఎక్కడైనా పెద్దపులి ఉంటే శబ్దాలకు భయపడి అడవిలోకి వెళ్తుందని అటవీ అధికారులు తెలిపారు.

